


నేడు, రేపు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కులకచర్ల, జనవరి 13: ఇప్పాయిపల్లి గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇప్పాయిపల్లి గ్రామవాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.20వేలు, రెండవ జట్టుకు రూ.10వేలు, మూడవ జట్టుకు రూ.5వేలు నగదు అందిస్తామని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు సకాలంలో హాజకు కావాలన్నారు.



శంకర్‌పల్లి మండలం చందిప్ప వద్ద షాఫ్ట్‌లో మట్టి, రాళ్లు తీసేందుకు ఏర్పాటు చేసిన క్రేన్(ఫైల్)

2008లో సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన 'ప్రాణహిత-చేవెళ్ల' ప్రాజెక్టుకు తాజాగా వచ్చిన సర్కారు ఊపిరిపోయనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పడకేసిన ఈ ప్రాజెక్టును రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రీడిజైన్ చేయనుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2.37లక్షల ఎకరాలకు సాగు, అలాగే అన్ని మండలాలకు తాగునీటిని అందించేందుకు తలపెట్టిన ఈ ప్రాజెక్టుకు మళ్లీ పట్టాలెక్కించేందుకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారు. గతంలో కొంత మేర పనులు ప్రారంభించిన ఈ ఎత్తిపోతలను త్వరలోనే పూర్తి స్థాయిల్లో చేపట్టి ఫలాలను అందించేందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సైతం తాజాగా వెల్లడించడం గమనార్హం. కొత్త ప్రభుత్వ నిర్ణయంతో సాగునీటికి ఎదురు చూస్తున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రాణహిత - చేవెళ్ల సాంకేతిక వివరాలు

నీరుపారే మండలాలు	88
గ్రామాలు	1,565
ఆయకట్టు (ఎకరాలు)	16,40,000
నీటిని తోడాల్సిన ఎత్తు(కి.మీ)	493
సొరంగాల పొడవు(కి.మీ)	188
లింకుల సంఖ్య	07
కాలువల పొడవు(కి.మీ)	512
లిఫ్టుల సంఖ్య	16
ప్రాజెక్టులోని ప్యాకేజీల సంఖ్య	28
అవసరమయ్యే విద్యుత్(మెగావాట్లు)	3,375
ప్రాజెక్టు అంచనా వ్యయం(రూ. కోట్లలో)	38,500

ప్రాణహితోస్మి

చిగురిస్తున్న 'ప్రాణహిత-చేవెళ్ల' ఆశలు!

- కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో తెరపైకి ప్రాజెక్టు నిర్మాణం
- ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సస్యశామలం
- చందిప్ప, మహాలింగపురంలో ఇప్పటికే 6 కిలో మీటర్ల సొరంగం పూర్తి
- బీఆర్ఎస్ పాలనలో పడకేసిన సుజల స్రవంతి పథకం
- అప్పట్లోనే రూ.వెయ్యి కోట్లు ఖర్చు.. ప్రస్తుతం వృథాగా దర్శనం
- 'ప్రాణహిత'పై సీఎం రేవంత్‌రెడ్డి సుముఖత : స్పీకర్ ప్రసాద్‌కుమార్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 13): నాడు జనం కష్టసుఖాలను తెలుసుకునేందుకు అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రజాప్రస్థానం చేపట్టారు. వ్యవసాయానికి బోర్లు వేయించి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలను చూసి చలించిపోయారు. ఆ కుటుంబాల కన్నీళ్లు తుడవాలంటే బీడు భూములకు సాగునీటిని అందించడమే పరిష్కారం అని నిర్ణయించుకున్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 'ప్రాణహిత-చేవెళ్ల' పథకానికి రూపకల్పన చేశారు. నాటి సీఎం దివంగత వైఎస్సార్ 2008 నవంబరు 19న ప్రాణహిత-చేవెళ్ల ఈ ఎత్తిపోతలకు శంకుస్థాపన చేశారు. 28 ప్యాకేజీల కింద తలపెట్టిన ఈ ప్రాజెక్టులో 23, 24 ప్యాకేజీ పనుల కోసం రూ.వెయ్యి కోట్లకుపైగా ఖర్చు చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలోని మహాలింగపురం, చందిప్ప గ్రామాల వద్ద 6 కిలో మీటర్లమేర సొరంగాన్ని తవ్వారు. తదనంతర కాలంలో అప్పటి ముఖ్యమంత్రి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడం, తెలంగాణ ఉద్యమం తదితర కారణాలతో ఈ ప్రాజెక్టు కొన్నేళ్లపాటు పడకేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో 'ప్రాణహిత-చేవెళ్ల' పనులను ఆపేసింది. దీంతో కొన్నాళ్ల పాటు సాగిన పనులు నిలిచిపోయాయి.





'ప్రజాపోరు'లో ప్రాజెక్టు పనులను వివరిస్తున్న సబితారెడ్డి(ఫైల్)

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయిం చిన రీడిజైనింగ్‌పై కాంగ్రెస్ పోరుబాట చేపట్టింది. మాజీ హోం మంత్రి సబితారెడ్డి నాయకత్వంలో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్(ప్రస్తుత స్పీకర్), నాటి ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి(ప్రస్తుత పరిగి ఎమ్మెల్యే), కూన శ్రీశైలంగౌడ్, బిక్షపతియాదవ్, సుధీర్‌రెడ్డి, అప్పటి డీసీసీ అధ్యక్షుడు క్యామ మల్లేష్ పోరుబాట పేరుతో ప్రాణహిత-చేవెళ్ల పథకం కోసం ఉద్యమించారు. చందిప్పలోని 23వ ప్యాకేజీ పనులను పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దీనికి పూర్తి చేయాలని కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున పోరుబాట నిర్వహించినా నాడు ప్రయోజనం లేకుండా పోయింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో మొత్తం 28 ప్యాకేజీలుండగా, వాటిల్లో 23వ ప్యాకేజీ పనలను పటేల్ అండ్ కంపెనీ నిర్వహించింది. 2011లో ప్రారంభించిన ఈ పనులు మామిడిపల్లి, జూకల్, మైలారం, శంకర్‌పల్లి మండలం చందిప్ప, మహాలింగపురంలో 23వ ప్యాకేజీలో సొరంగ మార్గం పనులు ఆరు కిలోమీటర్ల మేర పూర్తయ్యాయి. సొరంగం ద్వారా నీటిని తీసుకొచ్చేందుకు చాలా లోతు బావుల మాదిరిగా(షాఫ్టలు) తవ్వారు. 2023 నవంబరు 30న శాసనసభ ఎన్నికలు పూర్తయి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మళ్లీ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఊపిరి పోసుకుంటోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేవెళ్ల-ప్రాణహిత ప్రాజక్టను డిజైన్ మార్చి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తాగు, సాగునీటిని అందిస్తామని చేసిన ప్రకటనలు ప్రాణహితకు ఊపిరి పోసినట్లయ్యింది. ఉమ్మడి ప్రతిష్ఠాత్మక ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. గత పాలకుల పుణ్యమా అని ఈ ప్రాజెక్టును పక్కన పడేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో గతంలో తమ ప్రభుత్వం ప్రతిపాదించి మొదలు పెట్టిన పథకాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఈ ప్రాజెక్టు పూర్తయితే...

2008లో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిన 'ప్రాణహిత-చేవెళ్ల' సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం పూర్తయితే రాష్ట్రంలోని ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని బీడు భూములకు బోర్లతో సంబంధం లేకుండా నీరంది సస్యశామలం అయ్యే ఆస్కారముంది. రంగారెడ్డి జిల్లాలో కొత్తగా 40లక్షల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశాలున్నాయి. చేవెళ్ల ప్రాంతంలో 2.4లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అప్పట్లో అధికారులు అంచన వేశారు. ఉమ్మడి ఏడు జిల్లాల్లో ప్రజలకు లబ్ధి చేకూరనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా చేవెళ్ల ప్రాంతంలో 3టీఎంసీ నీరు స్టోరేజీ ఉండేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. చేవెళ్లకు-ప్రాణహిత జలాలను కాలువల ద్వారా షాబాద్, మొయినాబాద్ మండలాలకు పారించవచ్చని.. అలాగే పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలకు సైతం నీటిని అందిస్తామని ప్రాజెక్టు శంకుస్థాపన సమయంలో అప్పటి నేతలు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు తీసుకువచ్చేందుకు 38,500కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు నాటి ప్రభుత్వం ప్రకటించింది.



ప్రాణహిత జలాలను చేవెళ్ల పుష్కరిణిలో కలుపుతున్న అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

ప్రాజెక్టు ముఖ్యాంశాలు

- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు స్థాపన : 19 నవంబరు 2008
- నిర్మాణ కాలపరిమితి : 4 ఏళ్లు
- తెలంగాణ ప్రాంత ఉమ్మడి 7 జిల్లాల్లో కరువు పీడిత ప్రాంతాల్లోని 16,40,000ఎకరాల సాగు నీటిని అందించడం
- మార్గ మధ్యలోని గ్రామాలకు తాగునీటిని అందజేయడం
- హైదరాబాద్-సికింద్రాబాద్ నగరాలకు తాగునీటి సరఫరా
- పారిశ్రామిక అవసరాలకు నీటిని అందించడం.
- నీటి మళ్లింపు సామర్థ్యం : 160టీఎంసీలు
- 16ఎత్తిపోతల కేంద్రాలతో 7 కాలువల నిర్మాణం
- ప్రాణహిత నుంచి చేవెళ్ల వరకు 493మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం
- మొత్తం కాలువల పొడవు 700కిలో మీటర్లు



ఉమ్మడి రంగారెడ్డికి 'ప్రాణహిత' నీటిని తీసుకొస్తాం

గత బీఆర్ఎస్ పాలకులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు రాకుండా అడ్డుకున్న ప్రాణహిత-చేవెళ్ల జలాలను మా ప్రభుత్వం తీసుకొస్తుంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్ మార్చి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. మేం ఇప్పుడు మళ్లీ డిజైన్ మారుస్తాం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు, తాగు నీటిని అందిస్తాం. ఉమ్మడి జిల్లాలను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వం లక్ష్యం.

– గడ్డం ప్రసాద్‌కుమార్, అసెంబ్లీ స్పీకర్

ప్రాణహిత-సుజల స్రవంతి పథకంతో లబ్ధిపొందే మండలాలు

మండలం	ఆయకట్టు (ఎకరాల్లో)
వికారాబాద్	10,905
ధారూర్	30,839
మర్పల్లి	11,915
మోమిన్‌పేట్	16,445
పరిగి	21,289
దోమ	11,904
బంట్వారం	8,015
పెద్దేముల్	32,085
తాండూరు	39,290
యాలాల్	20,400
బషీరాబాద్	23,226
శంకర్‌పల్లి	7,597
చేవెళ్ల	2,709
మొత్తం	2,36,619

స్వల్పంగా పెరిగిన కందుల ధర



ధారూరు, జనవరి 13: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గత వారం కన్నా ఈ వారం కందుల ధరలు స్వల్పంగా పెరిగాయి. మార్కెట్‌యార్డులో శనివారం సాయంత్రం నిర్వహించిన బీట్లలో కందులు (ఎర్రవి) క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.9585, కనిష్ఠంగా రూ.9,450 ధర పలికింది. గత వారం కన్నా క్వింటాలు వద్ద రూ. 325లు ధర పెరిగింది. కాగా తెల్లకందులు మాత్రం క్వింటాలుకు రూ.8,600నుంచి రూ.8,900 వరకు ధర పలికింది. వేరుశనగ క్వింటాలుకు రూ.7,200 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. ధాన్యం సోనామసూరి రకం క్వింటాలుకు రూ.2,980 నుంచి రూ.3,000 వరకు, సాధారణ రకం రూ.2,000 నుంచి 2,200 వరకు ధర పలికిందని మార్కెట్ అధికారులు తెలిపారు.

మున్సిపల్ సిబ్బంది సంక్షేమానికి కృషి

ఘట్‌కేసర్, జనవరి 13 : మున్సిపల్ సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వైస్ చైర్మన్ పల్గుల మాధవరెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద సిబ్బందికి ఏడాదికి సంబంధించిన సబ్బులు, నూనె, బట్టలు, చెప్పులను అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని అన్నారు. నిత్యం వారు శ్రమించడం వల్లనే మున్సిపాలిటీ అన్ని రంగాల్లో రాణిస్తున్నదని గుర్తు చేశారు. వరసగా మూడు సార్లు అవార్డును దక్కించు కోవడంలో వారి కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, నాయకులు గోపాల్ రెడ్డి, పల్లె విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మూసి ఉన్న పెంగ్విన్ లేక్‌సైడ్ గేటు

యథేచ్ఛగా..

- పర్మిషన్ లేని రిసార్ట్స్‌కు నోటీసులు జారీ
- అయినా లెక్కచేయకుండా అడ్డగోలుగా నిర్వహణ

వికారాబాద్, జనవరి 13: జిల్లాలో అనుమతులు లేకుండా రిసార్ట్‌లు, ఫామ్ హౌస్‌ల నిర్మాణం జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వంలో అనుమతులు లేకుండా రిసార్ట్‌లు నడిపి నిర్వాహకులు సొమ్ము చేసుకున్నారు. గతంలో అనుమతులు లేవని ఓ రిసార్ట్స్‌పై చర్యలు తీసుకున్న తహసీల్దార్‌ను ఓ రాజకీయ నేత ఇతర మండలానికి బదిలీ చేయించారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ అధికారీ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మండలంలోని గోదాంగూడ రెవెన్యూ పరిధిలో అక్రమంగా అనుమతులు లేకుండా రిసార్ట్స్ నడుపుతున్నారు. ఎన్నో రోజులుగా ఇవి నడుస్తున్నా అటువైపు వెళ్లి నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. గోదంగూడ పరిధిలోని అనుమతుల్లేని ఆరు రిసార్ట్‌లకు అధికారులు నోటీసులు ఇచ్చారు. నోటీసులు ఇచ్చిన వాటిలో పెంగ్విన్, ది ట్రీ వండర్నెస్, అవని, టికీ, ది నేచర్ రీ ట్రీట్, ది మూన్ లైట్ రిసార్ట్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ నోటీసులు జనవరి 4వ తేదీన ఒక నోటీస్ ఇవ్వగా, మరో నోటీస్ కూడా ఇచ్చామని పంచాయతీ కార్యదర్శి వివరించారు. ఇప్పటివరకు ఎలాంటి అనుమతుల పత్రాలు అందలేదన్నారు. జిల్లా పంచాయతీ శాఖ అధికారి, మండల పంచాయతీ అధికారి ఆదేశానుసారం నోటీసులు ఇచ్చామన్నారు. అయినా యథేచ్ఛగా రిసార్ట్స్ బుకింగ్స్ తీసుకుని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

అధికారుల చేతివాటం

అనుమతులు లేకుండా రిసార్ట్స్‌ను నడుపుతూ నిర్వాహకులు అధికారుల చేతులు తడుపుతున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిసార్ట్స్‌లలో మందు చిందు కూడా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా హైదరాబాద్ మహానగరాల నుంచి యువతులను తీసుకొచ్చి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మార్చారని విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్పన్‌పల్లి చెరువు కబ్జా

రిసార్ట్ పేరుతో పక్కనే ఉన్న చెరువును కబ్జా చేస్తున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని ఆరోపిస్తున్నారు. ఆయకట్టుకోసం చెరువు నీటిని మళ్లించడంతో పాటు కొందరూ ఏకంగా చెరువులోనే టెంట్లు వేసి పర్యాటకులను ఆకర్షిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రిసార్ట్స్‌పై చర్యలు తీసుకొని అనంతగిరి పవిత్రతను కాపాడాలని వికారాబాద్ పట్టణ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతి సందడి

- పట్టణ వాసుల పల్లెబాట
- నేడు భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ
- లోగిళ్లలో రంగురంగుల ముగ్గులు
- జోరుగా పతంగుల విక్రయాలు
- పిండి వంటల ఘుమఘుమలు

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్/తాండూరు/పరిగి/మేడ్చల్‌ప్రతినిధి): పల్లెల్లో సంక్రాంతి శోభ నెలకొంది. మూడు రోజుల ముచ్చటైన ఈ పండగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. నేడు ఆదివారం భోగి వేడుకతో పండుగ ప్రారంభం కానుంది. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగ లను నిర్వహించుకుంటారు. సొంతూళ్లలో పండుగను జరుపుకోవడానికి వలస వెళ్లిన జనం పల్లెలకు తరలివ స్తున్నారు. రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్, కూడళ్లలో రద్దీగా నెలకొంది. కుటుంబసభ్యులు, బంధు వులతో ప్రతీ ఇల్లూ సందడిగా మారింది. పిండి వంటల ఘుమఘుమలు, వాకిళ్లలో రంగవల్లులు, బసవన్నలతో పల్లెలు, పట్టణాల్లో సందడి నెలకొంది. పంతగులతో పిల్లలు ఆడుకుంటున్నారు. ముగ్గుల్లో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను పెట్టి పసుపు, కుంకుమ అద్దుతారు. గొబ్బెమ్మను గౌరీదేవిగా పూజిస్తారు.

భోగి పండ్లతో చిన్నారులకు ఆశీర్వాదం

భోగిపండ్లు అంటే రేగుపండ్లు. సూర్యుడి రూపం, రంగు కలిగిన రేగు పండ్లతో నాణేలు కలిపి పిల్లలపై పోసి ఆశీర్వదిస్తారు. పిల్లలు సంబరంగా వేడుకలో పాల్గొంటారు. సాయంత్రం మహిళలు బొమ్మల కొలువు నిర్వహిస్తారు.



వికారాబాద్‌లో పతంగుల విక్రయాలు

నోరూరించే పిండి వంటలు

సంక్రాంతి అంటేనే గుర్తొచ్చేది పిండి వంటలు. ప్రతీ ఇంట సకినాలు, గారెలు, అరిసెలు వంటి పిండివంటలు చేసుకుంటారు. బియ్యం పిండి ముడిసరుకుగా కరకరలాడే సకినాలు చేస్తారు. సంక్రాంతికి పది రోజుల ముందు నుంచే సకినాలు, గారెలు, అరిసెలు, గరిజలు, మురుకులు, చేగోళ్లు, లడ్డూలు, పూస, చెక్కెరపల్లీ పదార్థాలను చేసుకుంటారు.

బియ్యం బంగారమాయె!

నిత్యావసర వస్తువులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. మిగతా సరుకుల ధరలు నిలకడగానే ఉండగా బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. ఎన్నడూ లేనంతగా బియ్యం ధరలు పెరగుతుండం సామాన్యుడిని కలవర పెడుతుంది. నిన్న మొన్నటి వరకు బియ్యం ధర 45 నుంచి 50 మధ్య లభించగా ఇప్పుడాధర ఏకంగా రూ.60కి పెరిగింది. కొంచెం మంచి రకాలైతే రూ.70 వరకు చెల్లించుకోవాల్సి వస్తుంది. ప్రజలు ఎక్కువగా వినియోగించే సన్న రకాలైన బీపీటీ, హెచ్ఎంటీ, సోనామసూరి ధరలు సగటున క్వింటాలుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు పెరిగాయి. గత ఏడాది జనవరిలో సోనామసూరి క్వింటాలుకు రూ.4,000 నుంచి రూ.4,400 వరకు పలుకగా, ప్రస్తుతం రూ.5,400ల నుంచి రూ.6,000ల వరకు పలుకుతున్నాయి. అదే దొడ్డు వియ్యం బియ్యం ప్రస్తుతం క్వింటాలుకు రూ.3,600ల నుంచి రూ.4,000ల వరకు పలుకుతున్నది. అన్ని కూరల్లో పండగల్లో వినియోగించే అల్లం వెల్లుల్లీ ధర మండిపోతుంది. కిలో అల్లం వెల్లుల్లీ మార్కెట్‌లో 280 నుంచి 300 వరకు అమ్ముడుపోతుంది. ఇక కూరగాయల ధరల విషయంలో బీరకాయ, బెండకాయ కిలో 60 రూపాయలు, చేమగడ్డ, పచ్చిమిర్చి, మునగ కాయల కిలో 80 రూపాయలు విక్రయిస్తున్నారు. గత నెల క్రితం పెరిగిన పప్పుల ధరలు, చికెన్, గుడ్ల ధరలు కాస్తా దిగి వచ్చాయి.



ప్రయాణికులతో కిక్కిరిసిన తాండూరు బస్టాండ్

ఊళ్లకు పోటెత్తుతున్న జనం

మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి పండుగ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు వలస పోయిన ప్రజలు, ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు, మహిళలు తమ సొంతూళ్లకు, పట్టణాలకు వస్తున్నారు. జనంతో బస్సులు, బస్టాండ్‌లు రద్దీగా మారాయి. పండుగ నేపథ్యంలో గ్రామాలు, తండాలు కొత్త వారితో కళకళలాడుతున్నాయి. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పండుగ కోలాహలం నెలకొంది. పిల్లలు పతంగుతో మైదానాల్లో సందడి చేస్తున్నారు. వంటకాలకు కావలసిన వస్తువులు కొనుగోళ్లతో మహిళలు బిజీగా ఉన్నారు.



ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు : స్పీకర్, కలెక్టర్ గౌతమ్



సంక్రాంతి పండగను పురస్కరించుకొని అసెంబ్లీ స్పీకర్‌ప్రసాద్‌కుమార్, మేడ్చల్‌జిల్లా కలెక్టర్ శశాంక ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుకలు ప్రజలకు మరింత ఆనందాన్ని పంచాలని ఆకాంక్షించారు. ఈ నూతన సంవత్సరంలో మనకు అన్నీ శుభాలే కలగాలని, అనుకున్న పనులన్నీ నెరవేరాలని వారు అభిలషించారు. ఏడాది పొడవునా ఇంటింటా సిరులకాంతులు విరజిల్లాలని కాంక్షించారు.

పాంబండ ఆలయంలో జిల్లా స్థాయి భజన పోటీలు


భజన పోటీల్లో పాల్గొన్న బండవెల్కిచర్ల గ్రామస్తులు

కులకచర్ల, జనవరి 13: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం జస్టిస్ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు వివిధ రకాల భజన పోటీల్లో పాల్గొన్నారు. అడుగుల భజన, పండరి భజనతో పాటు కీర్తనలు ఆలపించారు. బండవెల్కిచర్ల, చిన్నవారువల్ గ్రామాల ప్రజలు భజనలు చేసి ఆకట్టుకున్నాయి. గెలుపొందిన భజన టీం సభ్యులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల గ్రామ సర్పంచ్ సౌమ్యవెంకట్‌రాంరెడ్డి, బండవెల్కిచర్ల ఎంపీటీసీ జ్యోతి లక్ష్మీ శ్రీనివాస్‌గౌడ్, పోటీల న్యాయ నిర్ణేతలు రాజు, విశ్వనాథం, కేఎంఆర్ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి రాంచంద్రయ్య పాల్గొన్నారు.

జోరుగా గాలిపటాల కొనుగోలు


గాలిపటాలను కొనుగోలు చేస్తున్న యువకులు

కొడంగల్ రూరల్, జనవరి 13: సంక్రాంతి పండగ వచ్చిందంటే చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతీఒక్కరూ గాలిపటాలను ఎగురవేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. దీంతో మార్కెట్‌లో గాలిపటాల విక్రయాలు జోరందుకున్నాయి. కొడంగల్‌లో శనివారం గాలిపటాల కొనుగోలు కోసం దుకాణాల దగ్గర యువకులు, చిన్నారులు సందడి చేశారు.

భక్తిశ్రద్ధలతో గోదా రంగనాథ స్వామి కల్యాణోత్సవం


రంగనాథ స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మేడ్చల్ టౌన్, జనవరి 13: మండలంలోని గౌడవెల్లి గ్రామ శ్రీరామానుజ స్వామి వారి ఆలయంలో గోదారంగనాథ స్వామి వారి కల్యాణోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారి ఆశీసులు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి, ఉపసర్పంచ్ పెంటమ్మ, స్థానిక వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 13: వికారాబాద్ జిల్లా విశ్రాంత టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం డైరీని టీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవఅధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఆయన నివాసంలో విశ్రాంత ఉద్యోగులు ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా విశ్రాంత ఉద్యోగులు, టీఎస్ ఆర్టీసీ సమావేశాలు సభలు నిర్వహించుకునేందుకు వీలుగా స్థలం, భవన నిర్మాణానికి సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి వారికి సానుకూలంగా స్పందించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిటైర్డ్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు సాయన్న, కార్యదర్శి అబ్దుల్ జబ్బార్, ఎండీ ఫాజిల్, బీఆర్ రెడ్డి, సిద్దిక్, మన్నన్, రహీం, అనీఫ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

సాహిత్య వారసత్వం కొనసాగాలి: సిధారెడ్డి

రవీంద్రభారతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడమే తక్కువ అవుతున్న నేటి పరిస్థితుల్లో సాహిత్య వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. అమ్మంగి వేణుగోపాల్, ఆయన కుమార్తె అమ్మంగి కవితాస్వామి రచించిన పుస్తకాలను ఒకే వేదికపై ఆవిష్కరించుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అమ్మంగి వేణుగోపాల్ రచించిన 'ముఖచిత్రం', అమ్మంగి కవితాస్వామి రచించిన 'ముందడుగు' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో... మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లానని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకుపోవడంతో మంటలు చెలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం


ఆహ్వానపత్రికను అందుకుంటున్న పీఠాధిపతి శంకర్‌స్వామీజీ

బషీరాబాద్, జనవరి 13: మండలంలోనిదామర్‌చెడ్ అంబా భవానీ మాతదేవస్థానం పీఠాధిపతి శంకర్‌స్వామిజీని అయోధ్యలోని శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు వెళ్లనున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, విశ్వ హిందూ పరిషత్ తరఫున శనివారం జిల్లా వీహెచ్‌పీ, బీజేపీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేసినట్లు ఆయన వెల్లడించారు.

పట్నం నుంచి పల్లెబాట


తాండూరు ఆర్టీసీ బస్టాండ్‌లో లగేజీని అందజేస్తున్న మహిళలు

తాండూరు, జనవరి 13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం తాండూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. వివిధ గ్రామాల నుంచి తాండూరులో సంత చేసుకోవడానికి వచ్చి వారితో, సొంత గ్రామాలకు వెళ్లే వారితో ఆర్టీసీ బస్సులన్నీ నిండుగా కనిపించాయి. బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు పోటీపడ్డారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచితం కావడంతో మహిళలు ప్రైవేట్ వాహనాల కన్నా ఆర్టీసీ బస్సులు ఎక్కేందుకే ఆసక్తి చూపారు. పండుగ సందర్భంగా హైదరాబాద్ వెళ్లే మార్గం బస్సుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఆ రూట్‌లో వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు.

రామ్మోహన్‌కు నృత్య శిరోమణి అవార్డు ప్రదానం


అవార్డును అదుకుంటున్న రామ్మోహన్

శామీర్‌పేట, జనవరి 13: హకీంపేట ఆర్టీసీ డిపోలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్‌కు మహతి ఆర్ట్ థియేటర్ సంస్థ నృత్య శిరోమణి అవార్డును ప్రకటించింది. ఈమేరకు శనివారం నగరంలోని త్యాగరాయ గానసభలో సహస్ర అవధాని మాడుగుల నాగఫణిశర్మ చేతుల మీదుగా అందుకున్నారు. కూచిపూడి నృత్యంలో ఆయన ప్రదర్శనకుగానూ ఆ సంస్థ అవార్డును ప్రకటించడం పట్ల డిపో మేనేజర్ భవబూతి, విలేజ్ బస్ ఆఫీసర్ గోపు శ్రీనివాస్, సహోద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో మాజీ మంత్రి కుటుంబం


తిరుపతిలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతులు

తాండూరు, జనవరి 13: మాజీమంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ దంపతులు శనివారం తిరుమల తిరుపతివేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

ఓటరు జాబితాలో తప్పుల సవరణకు అవకాశం

కొందుర్గు, జనవరి13: ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని గ్రామాల్లోని 26 పోలింగ్ బూతుల్లో ఓటరు జాబితాలను గోడలకు అతికించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయించుకోవాలని, తప్పులుంటే వాటిని సరిచేసుకోవాలని, ఇందుకోసం ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య, గిర్దావరు శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి

బ్రహ్మోత్సవాలు ప్రారంభం


వేంకటేశ్వరస్వామి ఆలయం, కొలువు తీరిన స్వామివారు

మేడ్చల్, జనవరి13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ మండలం ఘణాపూర్ క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాంతి పర్వదినానికి ముందు స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు జాతరతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి వేదపండితులు తెల్లవారుజామునే సుప్రభాతసేవ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు వేదమంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో సామూహిక కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమాలకు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

జాతర మహోత్సవానికి సర్వం సిద్ధం

మేడ్చల్ మండలం ఘణాపూర్ గ్రామ శివారు, శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ గ్రామశివారు ఎత్తైన కొండల్లో వెలసిన శ్రీ క్షేత్రగిరి వెంకటేశ్వరస్వామి వారి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ప్రతీ ఏటా సంక్రాంతి పర్వదినం మరుసటి రోజు కనుమ పండుగ రోజున క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి వారి జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మేడ్చల్, శామీర్‌పేట మండలాల ప్రజల కొంగుబంగారంగా కోరిన కోరికలు తీర్చేదైవంగా కొలువబడుతున్న క్షేత్రగిరి వెంకటేశ్వరస్వామి జాతరకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఎత్తైన కొండపై ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలిసిన స్వామి కలియుగ ప్రత్యక్ష దైవంగా ప్రసిద్ధికెక్కారు. క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి వారి జాతర మహోత్సవంలో భాగంగా నేటి నుంచి ఈనెల 16వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో చూడముచ్చటగా ఆలయాన్ని తీర్చిదిద్దారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 14వ తేదీన స్వామివారి సామూహిక కళ్యాణం, మకర సంక్రాంతి, స్వామివారి మొక్కుబడి సేవలు, సామూహిక అర్చనలు, 15న కనుమ రోజున స్వామివారి కల్యాణం, పల్లకీసేవ, జాతర మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన


చౌదరిగూడలో అవగహన కల్పిస్తున్న భూపాలచారి

నందిగామ, జనవరి 13 : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగింది. నర్సప్పగూడ గ్రామంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి బీజేపీ నాయకులు హాజరై కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని, వాటిని ప్రజలకు తెలిపేందుకే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు నర్సింహ్మాగౌడ్, వెంకటేష్ గౌడ్, లక్ష్మణ్, అశోక్, మల్లేష్, వజ్రం, అరవింద్, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నందిగామ : సంకల్ప యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సద్వినియోగం చేసు కోవాలి

చౌదరిగూడ, జనవరి 13: ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పెద్ద ఎల్కిచర్ల సర్పంచ్ కమ్మరి భూపాలచారి అన్నారు. శనివారం మండల పరిధిలోని వీరన్నపేట్, వనంపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ తబుస్సుమ్ మెహరాజ్,ఎంపీహెచ్ఎస్ మేర్లీన్, ఎన్ఎం అరుణ, ఆశలు యాదమ్మ, కవిత, బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య, సలీం, మహేష్, చంద్రశేఖర్, హరీష్, నవీన్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు!

- తప్పిన ప్రమాదం... పలువురికి గాయాలు
- బ్రేకులు ఫెయిల్ కావడమే కారణం
- అనంతగిరి ఘాట్ రోడ్డులో ఘటన


సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వికారాబాద్/ధారూరు, జనవరి13 : ఘాట్‌రోడ్డులో బ్రేకులు ఫెయిల్ కావడంతో ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో పలువురు ప్రయాణికులకు గాయాలు కాగా, వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిధి అనంతగిరి ఘాట్ రోడ్డులో చోటు చేసుకుంది. తాండూరు డిపోకు చెందిన (టీఎస్34 టీఏ 6363) బస్సు 90 మంది ప్రయాణికులతో శనివారం హైదరాబాద్ నుంచి తాండూరు బయల్దేరింది. అనంతగిరిలోని అనంతపద్మనాభ స్వామి దేవాలయం దాటిన తరువాత ఘాట్ రోడ్డులో ఒక్కసారిగా బస్సు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ ఎండీ షఫీ బస్సులో ఉన్న వారికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయని అందరూ గట్టిగా పట్టుకోవాలని చెప్పుతూనే బస్సును ముందుకు పోనిచ్చాడు. చివరి ఘాట్ రోడ్డులో బస్సు అదుపు తప్పడంతో చాకచక్యంగా వ్యవహరించిన చెట్ల పొదల్లోకి పోనిచ్చాడు. ఈ క్రమంలో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. 108కు సమాచారమివ్వడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది గాయపడిన వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, అనంతగిరి ఘాట్ మార్గంలో రోడ్డు బాగా లేక పోవడంతో పాటు చెట్ల కొమ్మలు పెరిగి రోడ్డు మార్గం కన్పించకుండా తయారైంది. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు, ప్రయాణికులుపేర్కొంటున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు : డీసీపీ

మాడ్గుల, జనవరి 13 : సీసీ కెమెరాలు నేరాల అదుపులో ఉంతో ఉపయోగపడుతాయని మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి అన్నారు. మాడ్గుల మండలంలోని కొల్కులపల్లి గ్రామంలో శనివారం ఎంపీటీసీ, ఆమనగట్టు మాజీ మార్కెట్ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి రూ.లక్షా 30వేల సొంత డబ్బులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈమేరకు డీసీపీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని అన్నారు. పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్, మాడ్గుల సీఐ రాజశేఖర్, ఎస్సైలు రాములు, ఉపేందర్, యాచారం సీఐ సైదయ్య పాల్గొన్నారు.


కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

16న అధికారికంగా జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలు

ఆమనగల్లు, జనవరి 13: కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డుగ్రహీత, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత సూదిని జైపాల్‌రెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం ఇకపై అధికారికంగా నిర్వహించనుంది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ ఇన్‌చార్జి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ ఏడాది జనవరి 16న జయంతి, జూలై 28న వర్ధంతి కార్యక్రమాల నిర్వాహణకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని అధికారికంగా నిర్వహించడానికి ఆదేశాలు జారీచేయడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈనెల 16న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని స్ఫూర్తిస్థల్‌లో జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీసీసీ కార్యదర్శి సూదినిరాంరెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్లశ్రీనివాస్‌గౌడ్, యాటనర్సింహ్మా, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు తెలిపారు.

సంప్రదాయాలను గౌరవించాలి



బతుకమ్మలు, పోతరాజు విన్యాసాలతో విద్యార్థుల ప్రదర్శన

మేడ్చల్ టౌన్, జనవరి 13: అన్ని మతాల సంప్రదాయాలను గౌరవించి ఆదరించాలని కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వైస్‌చైర్మన్ భూపాల్‌రెడ్డి అన్నారు. కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేతో పాటు, సాంప్రదాయ కార్యక్రమాన్ని విద్యార్థులు అధ్యాపకులు నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అందమైన ముగ్గులు వేశారు. బతుకమ్మలను, పోతరాజుల విన్యాసాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ కేవీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఎమ్మెల్యే కార్యాలయం



క్యాంపు కార్యాలయం పనులు పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి

వికారాబాద్, జనవరి 13: వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్తాబవుతోంది. కొత్తగా ఎమ్మెల్యేగా గడ్డం ప్రసాద్ కుమార్ ఎన్నికవడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని వారికి తగ్గట్లు ముస్తాబు చేసుకున్నారు. ఇప్పటికే క్యాంపు కార్యాలయం చుట్టూ ప్రహరీతో పాటు లోపల అవసరమైన మరమ్మతులు చేశారు. అదేవిధంగా కొత్తగా రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. ఈ పనులను స్థానిక పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లుగా తెలుస్తోంది.

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన నాయకులు

లియాఫీ ఆలిండియా సలహాదారు సింగారపు శ్రీనివాస్ నేతృత్వంలో వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్ శాసన సభ స్పీకర్‌గా ఎన్నికైన నేపథ్యంలో శనివారం వారిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ లియాఫీ సమావేశానికి రావాలని నేతలు స్పీకర్‌ను ఆహ్వానించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో లియాఫీ హైదరాబాద్ డివిజన్ కౌన్సిల్ కార్యదర్శి సుదర్శనం, కన్వీనర్ కిచన్నగారి వెంకట్ రెడ్డి, ఆలిండియా కార్యవర్గ సభ్యులు బస్వలింగం పటేల్, వికారాబాద్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాస్, బి.మాణిక్యరెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, కేఎస్ఎన్.రెడ్డి, గడిల మల్లారెడ్డి ఉన్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన లియాఫీ నాయకులు

క్రైం కార్నర్

రాంరెడ్డిపల్లి శివారులో మహిళ పుర్రె లభ్యం

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు



రాంరెడ్డిపల్లి శివారులో పుర్రెను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

కులకచర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంరెడ్డిపల్లి శివారులో మహిళ పుర్రె కన్పించడం శనివారం కలకలం రేపింది. పుర్రె దోమ మండలం దొంగెన్కెపల్లికి చెందిన అనంతమ్మ(65)దిగా గుర్తించారు. అనంతమ్మ నాలుగు నెలలుగా అదృశ్యమైంది. ఆమె కుమారుడు ఆంజనేయులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అనంతమ్మ మతిస్థిమితంకోల్పోయి మద్యం తాగేది. గ్రామంలోని ఇంట్లో ఒక్కతే ఉండేది. నాలుగు నెలల కిందట ఆమె ఇంటికి తాళం వేసి అదృశ్యమైంది. శనివారం రాంరెడ్డిపల్లి శివారులో మహిళ పుర్రె గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ శ్రీశైలం, తహసీల్దార్ మురళీధర్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. పుర్రె, వెంట్రుకలు తప్ప మిగతా శరీర భాగాలు లేవు. పుర్రెలో తాళం చెవి లభించింది. తాళం చెవితో గ్రామానికి వెళ్లి ఇంటి తాళం తీశారు. పుర్రెను చూసిన స్థానికులు అది దొంగెన్కెపల్లికి చెందిన అనంతమ్మదిగా గుర్తించారని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై హైదరాబాద్‌లో ఉన్న ఆమె కుమారుడికి సమాచారమిచ్చామని, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలల కిందట మహిళ మృతిచెందడంతో ఆమె మిగతా శరీర భాగాలు దొరక్కపోవచ్చని తెలిపారు. కాగా అనంతమ్మ మృతిపై స్థానికులు సైతం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు గజ్జల సాయికుమార్(ఫైల్)

పూడూరు, జనవరి 13: బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి చెన్‌గోముల్ ఎస్ఐ కె.గిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన గజ్జల సాయి కుమార్(29) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తన సొంతపని నిమిత్తం బైక్‌పై మండలంలోని పెద్దఉమ్మెంతల్ గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకుని సాయికుమార్ తిరిగి వస్తుండగా, సోమన్‌గుర్తి గేటు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బైక్ అతివేగం అజాగ్రత్తగా నడుపుతూ సాయికుమార్ బైక్‌ను ఢీ కొట్టాడు. దీంతో సాయికుమార్ తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పరిగిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి భార్య గజ్జల అనిత తన భర్త మృతి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని చెన్‌గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

మహిళ అదృశ్యం



ఎద్దుల పద్మ

దౌల్తాబాద్, జనవరి 13: వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం మోట్లంపల్లి గ్రామానికి చెందిన ఎద్దుల పద్మ అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పద్మకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో మండలంలోని గుండెపల్లి శివారులో గల వీరభద్రస్వామి ఆలయానికి వచ్చారు. ఈక్రమంలో ఆమె కనిపించకుండా పోవడంతో భర్త, కుటుంబసభ్యులు వెతుకుతున్నారు. పద్మ ఎక్కడైనా కనిపిస్తే 8374009354, 8712670048 సెల్ నెంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

భారీగా చైనా మాంజా స్వాధీనం




చైనా మాంజాను పట్టుకున్న పోలీసులు

తాండూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో శనివారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి ఓ వ్యాపారి వద్ద రూ.1.11లక్షల విలువైన నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యాపారి నిషేధిత చైనా మాంజాను అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకొని కేసు నమోదు చేశారు. శివాజీచౌక్ పాండురంగ ఆలయ సమీపంలో ఓ వ్యాపారి చైనా మాంజా అమ్ముతున్నాడని సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ప్రమాదకర చైనా మాంజా ఎవరు అమ్మినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

వికారాబాద్: చైనా మాంజాను పోలీసులు పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎం.ప్రశాంత్ వర్ధన్ సిబ్బంది నమ్మదగిన సమాచారం మేరకు మహాశక్తి చౌరస్తాలో ఏర్పాటు చేసిన దినేష్, రాంబాబు పతంగి షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజ ఆరు పెద్ద చరకాలు, 20 చిన్న చరకాలు, 30లూస్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.


కలప తరలిస్తున్న లారీ పట్టివేత



పట్టుబడిన కలప లారీ

పూడూరు, జనవరి 13: అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు చెన్‌గోముల్ ఎస్ఐ గిరి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కండ్లపల్లి గేటు వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు నగేష్, మల్లేష్‌లు గస్తీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో కొడంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఓ లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో కలపను గుర్తించారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీ డ్రైవర్ మహ్మద్ ఖలీల్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నాగారంలో ట్రక్కు బోల్తా



ట్రక్కు బోల్తాపడడంతో రోడ్డుపై పడిపోయిన ఇనుప స్తంభాలు

కీసర రూరల్, జనవరి 13: నాగారం మున్సిపాలిటీ ప్రధాన రహదారిలో శనివారం తెల్లవారుజామున భారీ ట్రక్కు బోల్తాపడింది. ట్రక్కులోని ఇనుప స్తంభాలు రోడ్డుపైన పడిపోయాయి. ట్రాఫిక్ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. కుషాయిగూడ నుంచి కీసర వైపునకు వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో కీసర వైపునకు వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై పడిపోయిన ఇనుప స్తంభాలను క్రేన్ సాయంతో మరో లారీలోకి లోడ్ చేసి, ప్రమాదానికి గురైన ట్రక్కును అక్కడి నుంచి తరలించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ

పూడూరు, జనవరి 13: తుర్కఎన్కెపల్లి గ్రామానికి చెందిన పర్యమోని తిరుమలేష్ తన ఫోన్ పోగొట్టుకున్నట్లు చెన్‌గోముల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్ ఎక్కడుందో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శనివారం బాధితుడికి ఫోన్‌ను అప్పగించారు.

గడపగడపకు శ్రీరాముడి అక్షింతలు



పరిగిలో శ్రీరామ జన్మభూమి అక్షింతల వితరణ చేస్తున్న మహిళలు

పరిగి, జనవరి 13: శ్రీరామ జన్మభూమి అక్షింతల వితరణ కార్యక్రమం శనివారం పరిగిలో జరిగింది. రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు పిలుపు మేరకు శ్రీరామ జన్మభూమి అక్షింతలు శనివారం పరిగిలోని ఐదవ వార్డులోని తిరుమల, భవానినగర్‌లలో పూజిత అక్షింతల కలశ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అరుణ, కె.సుజాత, పారిజాత, అమృత, శోభ, శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మిట్టకోడూరు, రాపోల్ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

కులకచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్, రాంరెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం అయోధ్య రామమందిర అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. ముజాహిద్‌పూర్ గ్రామంలో ముందుగా హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి గ్రామంలోని పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, బీఆర్ఎస్ సారా శ్రీనివాస్, రాంరెడ్డిపల్లి ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి, న్యాయవాది యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దోమ: మండలంలోని లింగన్‌పల్లి గ్రామంలో శనివారం అయోధ్య శ్రీరాముడి పూజిత అక్షింతలను యువకులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అక్షింతలకు స్థానిక హనుమాన్ మందిరంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పిట్ల రవి, శ్రీనివాస్, నాగని శ్రీనివాస్, నాగని మహిపాల్, బల్ల దస్తయ్య, అంజి, రాము, రాజు, జైపాల్, యాదయ్య, బల్ల శ్రీనివాస్, గ్రామ పెద్దలు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కొడంగల్ మండలంలోని పర్సాపూర్‌లో శనివారం గ్రామస్తులు అయోధ్య రాముడి అక్షింతలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆలయంలో పూజలు నిర్వహించి ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు.

మోమిన్‌పేట్: మేకవనంపల్లి సొసైటి చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ పట్లోళ్ల అంజిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో జరిగే శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతీ ఒక్కరు అక్షింతలను తలపై చల్లుకొని భక్తిని చాటాలన్నారు. అంతకుముందు గ్రామస్థులు అక్షింతలతో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, రామచంద్రారెడ్డి, ఆంజనేయరెడ్డి, లింగం, విఠల్ పాల్గొన్నారు.

మర్రి చెన్నారెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలి



చెన్నారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వికారాబాద్, జనవరి 13: మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు సంకేపల్లి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి విగ్రహం వద్ద స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆయన 105 జయంతి సందర్భంగా పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్‌లో నిర్మించబోయే ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ కమాల్ రెడ్డి, శరణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొండా వీరారెడ్డి, మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ అనంత్ రెడ్డి, న్యాయవాది గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఔటర్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఘట్‌కేసర్, జనవరి 13: ఘట్‌కేసర్‌లో ఔటర్ కోసం సేకరించిన భూములను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకొని సర్వీసు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు చింతల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు చంద్రమోహన్, సబితతో కలిసి ఆయన మాట్లాడారు. ఔటర్ రింగురోడ్డు నిర్మాణానికి సేకరించిన భూములను పరిరక్షించడంలో హెచ్ఎండీఏ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. సర్వీసు రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అప్పటి మంత్రులు వారి స్నేహితుల కోసం, బంధువుల కోసం ప్రభుత్వం సేకరించిన భూములను వదిలేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో 2006వ సంవత్సరంలో బాధితులకు సరైన పరిహారం చెల్లించాలని ఉద్యమం చేసినట్లు గుర్తుచేశారు. హెచ్ఎండీఏ భూములను బ్యాంకుల్లో తాకట్టుపెట్టి రుణాలు పొందడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్‌లో మూడు వైపుల సర్వీసు రోడ్లను పూర్తిచేసి కేవలం ఘట్‌కేసర్ వైపుకు వెళ్లే సర్వీసు రోడ్డునే ఎందుకు పూర్తిచేయలేదని వారు ప్రశ్నించారు. యంనంపేట్ నుంచి ఘట్‌కేసర్ రావడానికి, ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వైపు వెళ్లడానికి సర్వీసు రోడ్డు కోసం సేకరించిన భూమిలో ఒకవైపు డ్యానో వ్యాక్సిన్ పరిశ్రమ యాజమాన్యం, మరోవైపు మాజీ మంత్రుల స్నేహితులు, అనుచరులు పాగా వేశారని ఆరోపించారు. ఈవిషయమై ఈనెల 19న అన్ని పార్టీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తామన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి



శామీర్‌పేట: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

పరిగి, జనవరి 13: సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. పద్మ డాన్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులు, పండ్లలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు బి.అర్చన, మీర్‌తాహేర్‌అలీ పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థినులు, మహిళలు పాల్గొని రంగు, రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త మురారివశిష్ట, ఆలయ ధర్మకర్తలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీలో శనివారం మహిళా శక్తి షై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముగ్గుల ద్వారా తమ ప్రతిభను కనబరిచారు. రంగులతో వివిధ కళాకృతులతో ఆకర్షణీయంగా ముగ్గులను వేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి శిల్ప మొదటి, కోమలి ద్వితీయ, మహేశ్వరి తృతీయ బహుమతులను గెలుపొందారు. మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు సారంగపాణి, మహిళా శక్తి షై వాయిస్ సభ్యులు అంబటి రమేష్, శ్రీదేవి, రాణి, తదితరులు పాల్గొన్నారు.



పరిగి: ముగ్గుల పోటీల్లో చిన్నారులతో పరిగి మునిసిపల్ చైర్మన్ అశోక్

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



బొంరాస్‌పేట్: క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ శంకర్

బషీరాబాద్, జనవరి 13: క్రీడలతో గ్రామీణ ప్రాంతాల యువకుల్లో స్నేహభావం పెంపొందుతుందని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కోడలు ఎం.నవ్యశ్రీరోహిత్‌మహరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్(బాలురు) గ్రౌండ్‌లో ఎంఎన్ఆర్-బీఎంఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం నవ్యశ్రీ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించేలా నిత్యం సాధన చేయాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల్లో రాణించిన వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉండటంతో పాటు గొప్ప కీర్తి ప్రతిష్టలు అభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేఖపవార్‌ఠాగూర్, మాజీ ఎంపీటీసీ నరేష్‌చౌహాన్, వార్డు మెంబర్లు సిద్ధార్థ, రాజన్న, నాయకులు ధన్‌సింగ్, మస్తాన్, ఆర్గనైజర్లు షేక్‌ఆదిల్, ఎండీ.హుజైర్, ఎండీ.అల్తాఫ్, అబ్బాస్‌అలీ, షేక్‌ఇద్రీష్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యానికి దోహదపడతాయని ఎస్సై శంకర్ అన్నారు. శనివారం మండలంలోని బొట్లవనితండాలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ ఉంటుందని, విద్యతో పాటు యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొని తలపడ్డాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహులునాయుడు, నాయకులు దేశ్య నాయక్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పండక్కి ఊరేళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి

మోమిన్‌పేట్, జనవరి 13: సంక్రాంతి పండగ సందర్భంగా సొంత గ్రామాలకు, బంధువుల దగ్గరికి వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఊరెళ్లేవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని, పండగకు ఊరేళ్లేందుకు హడవుడిలో బంగారు నగలు, వెండి వస్తువులను ఇళ్లలో ఉంచకుండా లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మేడ్చల్ టౌన్: ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ కె.వెంకట్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లో శనివారం భవన కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వలస వచ్చే వారు ముందుగా ట్రాఫిక్ నిబంధనల గురించి తెలుసుకోవాలన్నారు. సురక్షితంగా, ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు సురక్షితంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాను అరికట్టటంతో పాటు, ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కులకచర్ల: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కులకచర్ల ఎస్ఐ శ్రీశైలం అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతూ ప్రజల నుంచి డబ్బులు కాజేస్తున్నారన్నారు. లోన్ మంజూరైందని, ప్రభుత్వ ఆరు గ్యారంటీలు మంజూరుకు ఓటీపీ చెప్పాలని మోసం చేసేందుకు ప్రయత్నిస్తారన్నారు. ఇలాంటి ఘటనలు మండలంలో ఆలస్యంగా వెలుగు చూస్తున్నాయని చెప్పారు.. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఎవరికీ ఓటీపీలు చెప్పరాదన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

మేడ్చల్ టౌన్, జనవరి 13 : మున్సిపల్ పరిధిలోని ఇంటి యజమానులు తమ ఇంటి పన్నులను, నల్లా ట్యాక్సును వెంటనే చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ త్రిల్లేశ్వరావు కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చే పన్నులను ప్రజలు నిజాయితీగా సమయానికి చెల్లిస్తే నిధుల కొరత ఉండదన్నారు. తద్వారా అభివృద్ధి పనులు కొనసాగుతాయని తెలిపారు. వ్యాపార వాణిజ్య సంస్థలు మున్సిపల్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ పొందిన వ్యాపారస్తులు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 13 :కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామీణప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధి మర్రిపల్లిగూడలో శనివారం భారత్ వికసిత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమం జరిగింది. కేంద్రప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమపథకాలను గ్రామస్తులకు ప్రొజెక్టర్‌పై చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలుగూరి మంగమ్మ, వార్డుసభ్యులు మడ్డి లతవెంకటేష్, మడ్డి సుగుణరవిగౌడ్, మేకల సాయికుమార్, మంజుల, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని వెల్చాల్ గ్రామంలో శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 320 పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు రమేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ నెల 26 వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శేఖర్, ఆర్.నర్సింహులు ముదిరాజ్, నర్సింహులు, ఎర్రసత్యం, బాల్‌రాజ్, లక్ష్మణ్, వినయ్, పర్వీన్‌బేగం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **మోమిన్‌పేట్:** మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామంలో సర్పంచ్ పెద్దగోళ్ల అంజయ్య శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో నూతన గ్రామ పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైదలాపూరం సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** మండలంలోని ఐదు గ్రామాల్లో శనివారం బోర్డ్లు వేశారు. జడ్పీ చైర్‌పర్సన్ సునితామహేందర్‌రెడ్డి సహకారంతో తాండూరు జడ్పీటీసీ గౌడి మంజుల, వెంకటేశ్ ఆధ్వర్యంలో ఈ బోర్లు వేశారు. గౌతాపూర్ మల్లన్న ఆలయం, చింతామణిపట్నం, ఉద్దండాపూర్, చెంగోల్‌తోపాటు తదితర గ్రామాల్లో బోర్లు వేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** తూంకుట మున్సిపల్ దేవరయాంజాల్‌కు చెందిన అయ్యప్ప స్వాములు తమ 41రోజుల దీక్షను పూర్తి చేసుకుని శనివారం శబరిమల యాత్రకు బయల్దేరి వెళ్లారు. స్థానికంగా ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల భజనలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వెల్లివిరిసింది. భక్తుల రాకతో ఆలయం కళకళలాడింది. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుస్వాములు వలందాస్ మురళీగౌడ్, ఆకుల సత్యప్రభు, హరివర్ధన్, వేణు, హరి, రాహుల్, శకంర్, తదితరులు ఈ యాత్రలో ఉన్నారు.

● **తాండూరు రూరల్:** తాండూరు మండల ఎమ్మార్పీఎస్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జున్, నర్సింహులు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై మాదిగలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జనవరి 15వ తేదీన ఎమ్మార్పీఎస్ తాండూరు మండల కమిటీని ఎన్నిక చేయనున్నట్లు మల్లికార్జున్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ జిల్లా కో-కన్వీనర్ జాని, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాణిక్యప్ప, మొగులప్ప, హబ్రహం, భీమప్ప, సత్యానంద్, నర్సింహులు, గోపాల్, పరుశురాం, రాజేశ్వర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● **కొడంగల్:** రాష్ట్రంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న 22,500 మంది ఉద్యోగులకు నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, యండీ.షఫీ కోరారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు నేటి వరకు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంక్రాంతి పండుగ వేళ వేతనాలు అందకపోవడంతో మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు అందించాలన్నారు.